క్లుప్తంగా

మానవ హక్కులతోనే మనుగడ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

దక్కిలి: మానవాళి మనుగడకు మానవ హక్కులే మూలమని వెంకటేశ్వరపురం ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం డి.పెంచలయ్య అన్నారు. మంగళవారం మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో ర్యాలీ నిర్వహించారు. మానవ హక్కుల దినోత్సవంపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయుడు తేజోవర్మ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం



ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న దయాకర్

రాపూరు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు డివిజన్ ప్రోగ్రామ్ అధికారి దయాకర్ అన్నారు. రాపూరు మండలం వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట వైద్యాధికారిణి ప్రమీల రాజకుమారి, వైద్యసిబ్బంది ఉన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాళ్లు

కోట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ జాతీయస్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో విద్యానగర్ బాలభారతి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈపోటీలు చిలకలూరిపేటలో రెండు రోజులపాటు జరిగాయి. వై.జైదీప్, జి.జస్వంత్ బంగారు పతకాలు సాధించగా వై.మోక్షదీప్ వెండి పతకం, పి.పవన్, ఎస్.జస్వంత్ కాంస్య పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాళ్లు కర్రా శ్రీనివాసమూర్తి, వెంకటరమణమూర్తి తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

దివ్యాంగ విద్యార్థులను ప్రోత్సహించాలి



దివ్యాంగ విద్యార్థులకు ఇచ్చిన వీల్ చైర్స్

దక్కిలి: దివ్యాంగులను వారికి నచ్చిన, ఎంచుకున్న రంగాల్లో ప్రోత్సహించాలని ఎంఈఓ-2 పి.జగదీష్ అన్నారు. స్థానిక డక్కిలి జెడ్పీ హైస్కూల్‌లోని భవిత కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం ఏఎల్ఐ ఎంసీఓ సంస్థ వితరణగా అందజేసిన వీల్‌చైర్స్, ఎల్‌బో స్టిక్స్, రోలేటర్‌లను దివ్యాంగులకు అందజేశారు. ఎంఈఓ వెంకటేశ్వర్లు, కాంప్లెక్స్ హెచ్ఎం నాగరాజ, చైర్మన్ వెంకటరమణారెడ్డి, భవిత టీచర్లు సౌమ్య, బాలమేరి, ఫిజియోథెరపిస్టు సరిత పాల్గొన్నారు.

వీఆర్వోపై దౌర్జన్యం

సైదాపురం: 'మా పొలాలవి... నీవు దిగవద్దని ఎందుకు చెబుతావు.. నీవు కాపురం ఉంటున్న పొదలకూరుకు వచ్చి నిన్ను కొడుతా ఎవరూ అడ్డు వస్తారో చూస్తాం.' అంటూ వీఆర్వోపై ఊటుకూరు గ్రామానికి చెందిన మంచు శేషాద్రి, మంచు వెంకటసుబ్బయ్య దౌర్జన్యం చేశారు. ఈ విషయమై ఊటుకూరు వీఆర్వో చెంచురెడ్డి మంగళవారం తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై ఊటుకూరు సచివాలయంలో దౌర్జన్యం చేయడంతోపాటు కొట్టేందుకు కూడా ప్రయత్నించారని, తనకు తక్షణమే న్యాయం చేయాలని తహసీల్దార్ రమాదేవికి కూడా విన్నవించుకున్నట్లు వీఆర్వో చెంచురెడ్డి మంగళవారం విలేకరులకు తెలిపారు. ఊటుకూరు వీఆర్వో పొదలకూరులో కాపురం ఉంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం మంచు శేషాద్రి, మంచు వెంకటసుబ్బయ్య సచివాలయం వద్దకు వచ్చారు. వారిద్దరి మధ్య భూ తగాదాల్లో ఉన్నాయని, ఆ భూమిలోకి ఎవరూ దిగవద్దని వీఆర్వో తెలిపారు. అందుకు ఆగ్రహించి వెంకటసుబ్బయ్య, శేషాద్రి ఇద్దరూ కలిసి నానా దుర్భాషలాడడంతో పాటు వీఆర్వోను కొట్టేందుకు ప్రయత్నించారు. అక్కడే ఉన్న సహోద్యోగులు జోక్యం చేసుకుని వారిని బయటకు పంపేశారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

దొరవారిసత్రం: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ జి.చెంచుబాబు మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన స్టేషన్‌లోని వివిధ రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుకున్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట సీఐ సంఘమేశ్వరరావు, ఎస్ఐ అజయ్‌కుమార్ ఉన్నారు.

కమీషన్‌కు వ్యవసాయ కూలీలు..!



నాట్లు వేస్తున్న మహిళా కూలీలు

వరుణుడు కరుణించాడు. కాలువలు, చెరువులు, వంకలు నిండాయి. రైతన్నలు సంబరపడ్డారు. మోడు బారిన భూములను సైతం సాగులోకి తెచ్చారు. ఫలితంగా వర్షాధారంతోపాటు బోర్ల కింద సైతం పంటల సాగు పెరిగింది. దీంతో వరి నాట్లకు ఒక్కసారిగా కూలీలకు డిమాండ్ పెరిగింది. ఇదే అవకాశంగా దళారులు రంగప్రవేశం చేశారు. కమీషన్‌కు కూలీలను సరఫరా చేయడం ఉపాధిగా ఎంచుకుని రైతులను దోచుకుంటున్నారు. ఆరుగాలం పంట కోసం రైతన్నలు శ్రమిస్తుంటే, అట్టే కష్టం లేకుండా దళారీలు కమీషన్‌తో జేబులు నింపుకుంటున్నారు.

- కూలీల సరఫరాతో దండుకుంటున్న మధ్యవర్తులు
- కష్టం రైతులది..దోపిడీ దళారీలది
- రబీ సాగులో లబోదిబోమంటున్న రైతన్నలు

వాకాడు: వర్షాధారంతోపాటు బోర్ల ఆధారంగా పంటలు పండించే రైతులు సైతం ఒక్కసారిగా సాగు పనులు పెంచడంతో వ్యవసాయ కూలీలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో గత నెల రోజులుగా నారుమడులు సిద్ధం చేసుకుని నాట్లు వేసే కూలీల కోసం రైతులు వెంపర్లాడుతున్నారు. వాకాడు, కోట, చిట్టమూరు మండలాల్లో సాధారణ సాగు విస్తీర్ణం 22 వేల హెక్టార్లు ఉంది. గత నెల రోజులుగా పలు తుపానుల కారణంగా విస్తారంగా కురిసిన వర్షాలకు కాలువలు, చెరువులు, నదులు, వాగులు నిండాయి. ఈక్రమంలో రైతులు ఒక్కసారిగా దుక్కిలు చేసి నాట్లకు రంగం సిద్ధం చేశారు. మూడు మండలాల్లో కలిపి 145 వ్యవసాయ మహిళా కూలీల గ్రూపులు ఉన్నాయి. ఇవికాక ఇతర జిల్లాలు బాపట్ల, కాకినాడ, కృష్ణా, రాజమండ్రితోపాటు పశ్చిమబెంగాల్ నుంచి 75 వలస కూలీల బృందాలు వ్యవసాయ పనుల నిమిత్తం ఈ ప్రాంతానికి వచ్చారు. వర్షాలు సకాలంలో తగినంత కురవడంతో మోడుబారిన బీడు భూములను సైతం సాగులోకి తెచ్చారు. ఈక్రమంలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగడంతో వ్యవసాయ కూలీలకు మంచి డిమాండ్ పెరిగింది. రైతులంతా ఒకేసారి వరినాట్లకు సిద్ధం కావడంతో కూలీల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని మధ్యవర్తులు రంగప్రవేశం చేశారు. కమీషన్‌కు కూలీలను సరఫరా చేస్తూ అధిక ధరలతో రైతులను దోచేస్తున్నారు. వీరు చెప్పిందే రేటు..ఆ రేటు ప్రకారం రైతు చెల్లించాల్సిందే. సాధారణంగా రైతులు ఎకరా నాట్లు వేసేందుకు గతంలో రూ.2వేల నుంచి రూ.3 వేల వరకు కూలీలకు చెల్లించే వారు. ఈసారి డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రూ.5 వేల నుంచి రూ.5,500 వరకు గుంజుతున్నారు. ఈక్రమంలో మధ్యవర్తులుగా పనిచేస్తున్న దళారీలు ఎకరాకు రూ.600 నుంచి రూ.1000 వరకు మహిళా కూలీల కష్టార్జితం నుంచి కమీషన్ లాగుతున్నారు. ఇలా రోజుకు ఐదారుగురు రైతులకు కూలీలను పంపడం వలన చెమటోడ్చే కూలీల కన్నా మధ్యవర్తులకు రూ.రోజుకు రూ.5వేలు గిట్టుబాటు అవుతోంది. కూలీలకు మాత్రం రోజుకు రూ.500 నుంచి రూ.700 మాత్రమే వస్తుంది. ఇదే అదునుగా మేస్త్రీలు రోజు రోజుకు కూలీ రేట్లు అమాంతంగా పెంచేస్తున్నారు. నీరు పుష్కలంగా ఉండడంతో సన్న, చిన్న కారు రైతులందరూ సాగు ముమ్మరం చేశారు. వ్యవసాయ పనులు జోరుగా సాగుతుండడంతో దుక్కులు చేసేందుకు ట్రాక్టర్, నాగళ్లకు సైతం బాగా డిమాండ్ పెరిగి దొరకడంలేదు. దీంతో ఈ సారి ఎకరా దుక్కు చేయడానికి గతం కంటే రెట్టింపు పెట్టుబడులు పెట్టాల్సి వచ్చింది. కొన్నిచోట్ల కూలీలు దొరక్క ఈ పనిభారాన్ని యజమానులే భరిస్తున్నారు. కూలీల ధరలు పెరగడంతో ఎకరా పెట్టుబడి రూ.35వేల నుంచి రూ.40 వేలకు చేరి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వాకాడు, కోట, చిట్టమూరు మండలాల్లో రైతులు ప్రధానంగా వరి సాగుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గత ఖరీఫ్ సాగులో 5 వేల హెక్టార్లలో సాగు చేయగా, ఈ సారి అన్ని విధాల అనుకూలించడంతో 22 వేల హెక్టార్లకు సాగు పెరిగింది. మునుపెన్నడూలేని విధంగా రైతులు వరి సాగు పూర్తి విస్తీర్ణంలో చేపట్టడంతో పుడమి తల్లి ఎటు చూసినా పచ్చని వాతావరణంతో కనిపిస్తుంది. ఈక్రమంలోనే ఎక్కడ చూసినా వేసిన పంటలు వేపుగా, బలంగా పెరుగుతున్నాయి.



కూలీల డిమాండ్ వలన డ్రోన్‌తో పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు



నాట్లు వేయడానికి వెళుతున్న మహిళా కూలీలు

కూలీలు దొరకడంలేదు



ప్రస్తుతం ఎక్కడ చూసినా వ్యవసాయ పనులు జోరుగా సాగుతుండడంతో కూలీలు దొరకడం లేదు. సాగు చేయడానికి కావాల్సిన కూలీల కోసం రైతులు నాలుగైదు రోజులు వరకు ఎదురు చూడాల్సిన పరిస్థితి దాపురించింది. నాలుగు రోజులకు ముందే డబ్బు చెల్లించిన వారికే కూలీలు ప్రాధాన్యత ఇస్తున్నారు.

–కోట్లపూడి శ్రీనివాసులు
రైతు, కాశీపురం

కూలీలు దొరక్క అగచాట్లు



నాలుగు పక్కల వ్యవసాయ పనులు తలపడడంతో కూలీలు దొరక్క నానా అగచాట్లు పడుతున్నాము. అలాగే దుక్కులు చేయడానికి ట్రాక్టర్‌లు, నాగళ్లు దొరకడం లేదు. ఎవరైతే ఎక్కువ డబ్బులు ఇస్తారో వారికే ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో అన్ని పనులకు డిమాండ్ పెరిగిపోయి రేట్లు పెంచేశారు. ఈసారి పెట్టుబడులు అధికంగా పెరుగుతున్నాయి.

–చేను జనార్దన్, రైతు,
వాకాడు గొల్లపాళెం.

ప్రజల్లోనే ఉంటా!

–నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



సైదాపురం: కూటమి ప్రభుత్వం తప్పుడు, నెరవేర్చని హామీలను ప్రజలకు తెలియజేస్తూ ఎల్లప్పుడూ ప్రజల్లోనే ఉంటానని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అందరం కలసికట్టుగా ఉంటామని చెప్పారు. అధికారం ఉంది కదా అని దుశ్చర్యలకు పాల్పడితే మాత్రం చూస్తూ ఊరుకోమన్నారు. కార్యకర్తలు, నాయకులు వెన్నంటే ఉంటానన్నారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ అధికారపార్టీ చేస్తున్న తప్పులను దీటుగా ఎదుర్కొంటామన్నారు. మేము అధికారంలో ఉన్నప్పుడు ప్రజల కోసమే పనిచేశామని ఇప్పుడు కూడా ప్రజల్లోనే ఉంటామని ఆయన అన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా!

చిట్టమూరు(చిల్లకూరు): వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. చిట్టమూరు మండలం మెట్టు గ్రామానికి చెందిన ముడి నాగూర్‌రెడ్డి ఇటీవల మృతిచెందడంతో వారి కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

వ్యవసాయ మోటార్ల చోరీ

దొరవారిసత్రం: మినమనముడి గ్రామ పరిధిలోని వరి పంటలో ఉన్న మూడు వ్యవసాయ మోటార్లు సోమవారం రాత్రి చోరీకి గురయ్యాయి. ఈఘటన మంగళవారం వెలుగుచూసింది. బాధిత రైతుల కథనం మేరకు.. మినమనముడి గ్రామానికి చెందిన బొబ్బూరు సుబ్రమణ్యం, ఇంటూరు సుబ్రమణ్యం, నల్లమారి సుబ్రమణ్యంకు చెందిన వరి పంటలో మూడు మోటార్లు ఉన్నాయి. ఈక్రమంలో మంగళవారం ఉదయం పొలాలకు సాగు నీరు పట్టేందుకు పొలంలోకి వెళ్లి చూడగా మూడు మోటార్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితులు డీవీ సత్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాగులో సస్యరక్షణ చర్యలు

దక్కిలి: వరి సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని వెంకటగిరి వ్యవసాయ శాఖ ఏడీఏ నాగార్జునసాగర్ తెలిపారు. డక్కిలిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ అధికారులు నిర్వహించారు. ఈసందర్భంగా పశు వైద్యశాఖ ఆధ్వర్యంలో దూడల్లో నులిపురుగులు నివారణకు నట్టల నివారణ మందును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ విజయభారతి, పశువైద్యాధికారి కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి సారూ!



పుల్లూరులో రెవెన్యూ గ్రామసభ

పెళ్లకూరు: మండలంలోని పుల్లూరు పెద్దచెరువు ఆక్రమణలను తొలగించండి సారూ అంటూ పలువురు గ్రామస్తులు మంగళవారం పుల్లూరులో జరిగిన రెవెన్యూ గ్రామసభలో తహసీల్దార్ ద్వారకానాథరెడ్డికి ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నంబరు 104లో వంద ఎకరాల మేర పెద్దచెరువు విస్తీర్ణం ఉంది. అయితే కొణతనేరి గ్రామానికి చెందిన కొందరు రైతులు చెరువు ఎగువ భూమిని ఆక్రమించుకోవడంతో ఆయకట్టు రైతులకు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. అందువల్ల చెరువును సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేసి ఆక్రమణలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశీలించి చర్యలు చేపడతామని తహసీల్దార్ పేర్కొన్నారు. ఆర్ఐ సంతోషిణిబాయి, వీఆర్వోలు కల్యాణి, రమేష్, వంశీ, వీఆర్ఏలు కృష్ణ, గోపాల్ నేతలు గురవారెడ్డి, గురవయ్య, కృష్ణయ్య, సిద్దులనాయుడు, కుమార్, రవి, చంద్రయ్య పాల్గొన్నారు.

మోతాదుకు మించి వాడొద్దు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సైదాపురం: రైతులు మోతాదుకు మించి ఎరువులు, పురుగుమందులను వినియోగిస్తే అనర్థాలు తప్పవని నెల్లూరు ఏడీఓ ఎస్.శ్రీనివాసులు అన్నారు. తురిమెర్ల, తలుపూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధిక యూరియా వాడకం వల్ల తెగుళ్ల ఉధృతి పెరుగుతుందన్నారు. పంట వేసిన ప్రతి రైతు ఈక్రాప్ నమోదు చేసుకోవాలని కోరారు. పురుగుమందులు స్ప్రే చేసే సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏడీఓ వివరించారు.

ఆదిశంకరలో ఫియర్ బృందం సందడి



మాట్లాడుతున్న హీరోయిన్ వేదిక

గూడూరురూరల్: గూడూరు సమీపంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఫియర్ చిత్ర బృందం సందడి చేసింది. కళాశాల చైర్మన్ వంకి పెంచలయ్య నిర్మాతగా వ్యవహరిస్తున్న చిత్రాన్ని ప్రమోట్ చేసే క్రమంలో కళాశాలలో చిత్ర బృందం పరిచయ కార్యక్రమం నిర్వహించారు. చిత్ర నిర్మాత, దర్శకురాలు హరిత గోగినేని మాట్లాడుతూ అన్ని వర్గాల వారిని ఆకట్టుకునేలా నిర్మించిన ఈ చిత్రం ఈనెల 14న విడుదల చేస్తున్నామని అన్నారు. చిత్ర హీరోయిన్ వేదిక, గుంతలకిడి గులగుల ఫేం సాల్మన్, డీన్ డాక్టర్‌ఎం రాజయ్య, చిత్రసభ్యులు ఏఆర్ అబి, దాసరి సాహితి, కళాశాల ఏఓ రామయ్య పాల్గొన్నారు.

పౌరులందరికీ సమాన హక్కులు



గూడూరు: మాట్లాడుతున్న న్యాయమూర్తులు

గూడూరురూరల్: దేశంలోని పౌరులందరికీ సమాన హక్కులను రాజ్యాంగం కల్పించిందని గూడూరు ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానాబేగం అన్నారు. గూడూరు కోర్టు హాల్‌లో మంగళవారం మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతిఒక్కరికి సమానంగా అమలు చేయాలన్నారు. ఇందులోభాగంగానే లోక్ అదాలత్, హ్యూమన్‌రైట్స్, లీగల్ ఎయిడ్ వంటివి కల్పించారని తెలిపారు. అలాగే ఈనెల 14న లోక్ అదాలత్ నిర్వహించేందుకు కావల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు బి.వి.సులోచనారాణి, పి.లోకనాథం, శంకరయ్య, వి.లక్ష్మీనారాయణ, ఏపీపీ రమణకుమార్, గూడూరు డీఎస్పీ వి.వి. రమణకుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు భాస్కరరావు, అరవ పార్వతయ్య, ఏ.కోటేశ్వరరావు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



నాయుడుపేట: మాట్లాడుతున్న జడ్జి సంయుక్త

నాయుడుపేటటౌన్: మహిళలు చట్టాలపై పూర్తిగా అవగాహన కల్గి ఉండాలని నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టు జడ్జి సంయుక్త సూచించారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని డాక్టర్ అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం మహిళలతో సమావేశం నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు పసల గంగాప్రసాద్, చెంగయ్య, షేక్ రఫీ, సుమన్ పాల్గొన్నారు.

అదేవిధంగా మండల పరిధిలోని పుదూరు బాలికల గురుకుల పాఠశాలలో ఘనంగా మానవ హక్కుల దినోత్సవం జరుపుకున్నారు. ప్రిన్సిపల్ రూత్‌రమోలా ఆధ్వర్యంలో విద్యార్థినులతో కలసి ర్యాలీ నిర్వహించారు. టీచర్లు తన్నీరు శశికళ, కృపావతి, సుధ, పద్మజ పాల్గొన్నారు.

అధిక రసాయనాలు అనర్థదాయకం

గూడూరురూరల్: అధిక రసాయనాల వాడకం అనర్థదాయకమని గూడూరు ఏఓ రమేష్ రైతులకు సూచించారు. విందూరు, మిటాత్మకూరు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వరినాట్లను ఆయన పరిశీలించారు. రైతులు వరికి పసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రసన్న, దివ్య పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా కృషిచేయాలి



మాట్లాడుతున్న పీడీ శోభన్‌బాబు

నాయుడుపేటటౌన్: పొదుపు మహిళా సంఘాల అభివృద్ధే ధ్యేయంగా కృషిచేయాలని ఏపీఎం, సీసీలను డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గూడూరు, సూళ్లూరుపేట డివిజన్‌ల పరిధిలోని 11 మండలాలకు చెందిన ఏపీఎంలు, సీసీలకు వివిధ అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ పొదుపు మహిళలు స్వశక్తితో అభివృద్ధి చెందేందుకు చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు వారికి బ్యాంకుల ద్వారా రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పొదుపు మహిళలు తయారు చేసిన వివిధ రకాల వస్తువులను ఆన్‌లైన్‌లో విక్రయాలు జరిపేలా అవగాహన కల్పించాలన్నారు. ఏపీడీ ప్రభావతి, గూడూరు ఏసీ మురళి పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



చిల్లకూరు: అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే



రాపూరులో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సు

సైదాపురం: భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తోందని తహసీల్దార్ రమాదేవి అన్నారు. మండలంలోని లింగసముద్రం రాగనరామాపురం, తిప్పిరెడ్డిపల్లి, ఎస్‌వీ కండ్రిగ గ్రామాల్లో మంగళవారం గ్రామసభను నిర్వహించారు. రైతులు, ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్వో పాల్గొన్నారు.

ఓజిలిలో..

ఓజిలి: వాకాటివారికండ్రిగ, వెంకటరెడ్డిపాళెం గ్రామాల్లో తహసీల్దార్ పద్మావతి రెవెన్యూ సదస్సులను మంగళవారం నిర్వహించారు. సదస్సులో 10 వినతులు అందాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ట్రాన్స్‌కో ఏఈ అనీల్‌కుమార్, ఆర్ఐ విజయ్‌కుమార్, సర్వేయర్ లక్ష్మీనారాయణ, వీఆర్వోలు చంద్రశేఖర్, కస్తూరయ్య, మస్తానయ్య పాల్గొన్నారు.

దొరవారిసత్రంలో..

దొరవారిసత్రం: నేలపట్టు, మైలాంగం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రేషన్ కార్డులు, ఇంటి స్థలాల కోసం, భూసమస్యలపై వినతులు అందినట్లు రెవెన్యూ అధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శైలకుమారి, సర్వేయర్ నాగరాజు, దేవదాయశాఖ అధికారి మూర్తి, ఆర్ఐ ప్రవీణ్ రాయల్ పాల్గొన్నారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీన, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ గోపి, ఏడీఏ గోపినాయక్, దేవదాయశాఖ ఈఓ నవీన్‌కుమార్, నేతలు తానంకి నానాజీ, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రాపూరులో..

రాపూరు: రాపూరు బిట్ 1లో రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. 1బీ, పాసుపుస్తకాలు, మ్యుటేషన్లు, భూసమస్యలపై అర్జీలు అందించారని తహసీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు. సర్పంచ్ జయమ్మ, సర్వేయర్లు కోటేశ్వరావు పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని వెగలపోన్నూరు, సుద్దమడుగు, తాగేలి పంచాయతీల్లో తహసీల్దార్ నరసింహరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ప్రజల నుంచి అధికారులు 49 అర్జీలను స్వీకరించారు. వీఆర్వోలు, సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రసంగాలు ఒక వైపు.. బోధన మరో వైపు

చిల్లకూరు: పాఠశాలకు సెలవు రోజున సభలు, సమావేశాలు నిర్వహిస్తే విద్యార్థులకు ఇబ్బంది ఉండదు. అయితే పాఠశాల జరిగే రోజు విద్యార్థులకు దగ్గరగా మైక్‌ల నుంచి వచ్చే ప్రసంగాలతో వారు చదువులపై దృష్టి పెట్టలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి సంఘటనే మంగళవారం చిల్లకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చోటుచేసుకుంది. పాఠశాల ఆవరణలో రెవెన్యూ సదస్సును నిర్వహించడం, దీనికి స్థానిక ఎమ్మెల్యే సునీల్‌కుమార్ హాజరు కావడంతో మండలంలోని అన్ని గ్రామాల నుంచి నాయకులు, అభిమానులు తరలి రావడంతో పాఠశాల ఆవరణలో హడావుడి ఎక్కువైపోయింది. దీంతో పక్కన తరగతి గదిలో ఉన్న విద్యార్థులు చదువులపై దృష్టి పెట్టలేక ఇబ్బందిపడ్డారు.